ప్రజాశక్తి
శుక్రవారం 16 డిసెంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పాఠశాలల్లో బదిలీల జాతర

- దరఖాస్తుకు రేపటితో ముగియనున్న గడువు
- మరోరెండు రోజులు పెంచాలని ఉపాధ్యాయుల వినతి
- నెలాఖరుకు ప్రక్రియ ముగిసేనా?



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు శనివారం ఆఖరు తేదీ కావడంతో ఉపాధ్యాయులంతా ఈఅంశంపై దృష్టి సారించారు. దాదాపు 10 వేల మంది బదిలీలకు దరఖాస్తు చేయనున్నట్టు తెలిసింది. వీరిలో నిబంధనల ప్రకారం 3 వేల మందికి పైగా బదిలీకి అవకాశం ఉంది. నూతన విద్యా విధానం అమలులో భాగంగా మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీప హైస్కూల్సులో విలీనం చేయడం వల్ల జిల్లాలో ఇప్పటికే 1400 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. అయినా ఇప్పటికీ చాలా పాఠశాలల్లో టీచరు, విద్యార్థుల నిష్పత్తిలో ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పాఠశాలలో సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల కూడా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా టెన్తు విద్యార్థుల ఇబ్బందులు చెప్పలేనివిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యా సంవత్సరం మధ్య బదిలీలకు ప్రభుత్వం అనుమతించింది. ఈ అంశంపై తల్లిదండ్రుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరో రెండునెలల్లో 2022-23 విద్యా సంవత్సరం నిలబస్ పూర్తి కానుంది. మార్చిలో టెన్తు పరీక్షలు జరగనున్నాయి. తరువాత మిగిలిన క్లాసుల పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వ తేదీలోగా ఉపాధ్యాయుల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఎప్పటి నుంచో ఉపాధ్యాయులు బదిలీలు కోరుతున్నారు. అయితే సహజంగా విద్యా సంవత్సరం ముగిసి తిరిగి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా ఈ ప్రక్రియ పూర్తిచేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదు. మరో రెండు నెలలో విద్యార్థులంతా పరీక్షలకు సిద్ధం కావాల్సిన తరుణంలో బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడం సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తున్నారు. ఐదేళ్లు ఒక చోట పనిచేసిన ప్రధాన ఉపాధ్యాయులు, ఎనిమిదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీకి అర్హులుగా నిర్ధేశించారు. దరఖాస్తుల పరిశీలన 26 వరకు జరుగుతుంది. 27వతేదీ నుంచి ఖాళీగా ఉన్న స్థానాలను కోరుకునే అవకాశం కల్పించారు. బదిలీల ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల 11 నుంచి కొత్త స్థానాలకు వెళ్లేలా కార్యచరణ సిద్ధం చేశారు. మరో వైపు బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురవుతున్న తమకు

2లో

రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చారు

ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలి : సిపిఎం


పెదకాకానిలో దర్గాకు వెళ్లే దారిలో ఇళ్లు కూల్చివేస్తున్న పొక్లెయినర్

ప్రజాశక్తి - మంగళగిరి

నాలుగైదు దశాబ్ధాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లను గురువారం రోడ్డు విస్తరణ పేరుతో అధికారులు కూల్చివేశారు. బాధితులను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వైనేతాజీ, పెదకాకాని మండల కార్యదర్శి ఎస్.శివాజి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పెదకాకాని గ్రామంలో దర్గాకు వెళ్లే దారిలో గత 40 సంవత్సరాలుగా ఇళ్లు వేసుకుని పేదలు నివసిస్తున్నారన్నారు. ముందుగా నోటీసులు ఇవ్వకుండా రోడ్డు కిరువైపులా ఉన్న 27 ఇళ్లకు పొక్లెయినర్‌తో కూల్చివేశారన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో పేదల ఇళ్లు తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వై నేతాజీ డిమాండ్ చేశారు.

చెత్తపన్నుపై సమరం

బలవంతపు వసూళ్లు తక్షణమే ఆపేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో బలవంతంగా చెత్త పన్ను వసూలు చేయడాన్ని నిలిపివేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెత్త పన్ను వసూలు నిలుపుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో సిపిఎం నాయకులు డి శ్రీనివాస

2లో


మాట్లాడుతున్న పాశం రామారావు

కూరగాయాల మార్కెట్‌కు అధునాతన భవనం

రూ.163.61కోట్లతో ప్రభుత్వం అనుమతి

వివరాలు వెల్లడించిన మేయర్ కావటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

2లో


మీడియాతో మాట్లాడుతున్న మేయర్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

డాక్టర్ నరేన్‌కు నీట్‌లో ఆలిండియ 2వ ర్యాంకు



ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరుకు చెందిన పోలవరపు నరేన్ జాతీయ స్థాయిలో జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో, న్యూరాలజీ విభాగంలో ఆలిండియా రెండో ర్యాంకు సాధించారు. ఇటీవల జరిగిన ఎంసిసి సూపర్ స్పెషాలిటీ కౌన్సెలింగ్ ద్వారా తమిళనాడులోని ప్రతిష్టాత్మక మద్రాసు మెడికల్ కాలేజిలో డిఎం న్యూరాలజీ సీటు పొందారు. డాక్టర్ నరేన్ భార్య డాక్టర్ సిరి చందనకు తమిళనాడులోని ఎస్ఆర్ఎంసి మెడికల్ కాలేజిలో నెఫ్రాలజీ విభాగంలో డిఎం సీటు లభించింది. డాక్టర్ నరేన్ గుంటూరు మెడికల్ కాలేజిలో ఎంబిబిఎస్ పూర్తి చేసి, అనేక బంగారు పతకాలు సంపాదించి, అందరికంటే అత్యధిక మెడల్స్‌ను సాధించాడు. హౌస్ సర్జన్ చేస్తుండగానే నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో కూడా మంచి ర్యాంకు పొంది జనరల్ మెడిసిన్ విభాగంలో సీటు సాధించారు. తన తల్లిదండ్రులైన ప్రముఖ డాక్టర్లు డాక్టర్ పి.వి.రాఘవ శర్మ, డాక్టర్ పి.విజయ, గురువులు డాక్టర్ సుందరాచారి తనకు ఆదర్శమని ఈ సందర్భంగా నరేన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో న్యూరాలజీ విజ్ఞానం సంపాదించుకొని సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్ష అని చెప్పారు.

వర్సిటీ వేదికగా యువజనోత్సాహం

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

విద్యార్థులు తమలో దాగిన ప్రతిభాపాటవాలు వెలికి తీయాలి

ప్రారంభ సభలో ఆచార్య నాగార్జున వర్సిటీ విసి పి రాజశేఖర్


మాట్లాడుతున్న విసి ఆచార్య రాజశేఖర్

ప్రజాశక్తి -ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో గురువారం యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభ అనంతరం మొదటి రోజు వివిధ అంశాలలో పోటీలు జరిగాయి. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో జరుగుతున్న యువజన ఉత్సవాలకు హాజరై తమ ప్రతిభను చాటారు. మొదటిరోజు క్లాసికల్ డాన్స్, సింగింగ్, స్కిట్, మైమ్ అంటే అంశాలలో పోటీలు జరిగాయి. ప్రదర్శనలను తోటి విద్యార్థులు ప్రోత్సహిస్తూ మరింత పండగ వాతావరణాన్ని కల్పించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

2లో













ప్రేమ వ్యవహారంలో దళిత యువకుడిపై దాడి

ప్రజాశక్తి-తాడికొండ

అగ్రవర్ణాల యువతిని ప్రేమించిన దళిత యువకునిపై దాడిచేసి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ లాక్కుని, యువతితో సంబంధం లేదని యువకుడితో లెటర్ వ్రాయించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం, తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి ప్రాంతానికి చెందిన గుంటు చందు తాడికొండ మండలంలోని మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అదే కళాశాలలో ప్రకాశం జిల్లా పర్చూరుకు చెందిన యువతి బిటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. వారు ప్రేమించుకుంటున్నారన్న విషయం తెలిసిన యువతి సోదరుడు తనను దుర్భాషలాడి సెల్ ఫోన్, ల్యాప్‌టాప్ లాక్కొని వెళ్లిపోయారని చందు ఆరోపించారు. తిరిగి ఈనెల 12వ తేదీ మోతడక లోని తన రూమ్‌లో ఉండగా యువతీ సోదరులు వచ్చి దుర్భాషలాడి దాడి చేసి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని తెలిపాడు. ఈ మేరకు గురువారం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చందు తెలిపాడు. ఇరు వర్గాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామనిపోలీసులు తెలిపారు.

జిజిహెచ్ లో త్వరలో గుండె ఆపరేషన్లు

డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేతో చర్చలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొంత కాలంగా నిలిచిపోయిన గుండె శస్త్ర చికిత్స లు త్వరలో పున: ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఉన్నతాధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గతంలో పని చేసిన పద్మశ్రీ డాక్టర్ ఆళ్ళ గోపాలకష్ణ గోఖలే కు మరోసారి ఈ బాధ్యత లను అప్పగించనున్నారు. డాక్టర్ గోఖలే నేతత్వం లో గురువారం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి ని ఆమె ఛాంబర్ లో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ గోఖలే నిపుణుల బందం తో కల్సి డాక్టర్ ప్రభావతి ఆసుపత్రి లోని వార్డులు, శస్త్ర చికిత్స గదులను పరిశీలించారు. ఆస్పత్రిలోని ఆపరేషన్లు థియేటర్లు, రోగులకు అవసరమైన వార్డులు ఏవిధంగా సమాకూర్చాలన్న అంశాల గురించి చర్చించినట్లు డాక్టర్ ప్రభావతి చెప్పారు. శస్త్ర చికిత్స ల కోసం అవసరమైన పరికరాలు, సిబ్బంది నియామకాలు, ఔషదాలు అందుబాటులో ఉంచాలన్న విషయాలపై కూడా సమావేశం లో చర్చించిన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్త గా డాక్టర్ కుప్పుస్వామి నియమించినట్లు ఆమె తెలిపారు. డాక్టర్ గోఖలే వెంట డాక్టర్ కోనేరు సుధాకర్, డాక్టర్ కల్యాణి రమ, డాక్టర్ రామకష్ణా రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, మత్తు వైద్యులు కుప్పు స్వామి, ఎం వి రామ రాజు, డాక్టర్ విజయలక్ష్మి, సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ ఆర్ ఎం ఓ డాక్టర్ ఝూన్సీ లు ఉన్నారు.



ఇదే కర్మ రాష్ట్రానికి ..పోస్టర్‌ను చూపుతున్న నాయకులు

కుంచనపల్లిలో ఇదేం కర్మ రాష్ట్రానికి..

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లీలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం గురువారం రాత్రి గ్రామ అధ్యక్షులు కనుగొలు కోటేశ్వర రావు అధ్యక్షతన జరిగింది.టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై అధిక భారాలు వేశారని ప్రచారం చేశారు.ప్రధానంగా అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలు, చెత్త పన్ను వసూలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, గ్రామ ప్రధాన కార్యదర్శి బిరుదు గడ్డ రమేష్, తెలుగు రైతు నాయకులు కొలంటి మహేష్, తెలుగు యువత నాయకులు మారుమాకా అబ్రహం, మనిక్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ పాటించాలి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణం సుందరంగా ఉండాలంటే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పాటించాలని టూటౌన్ సిఐ వెంకటరావు అన్నారు. గురువారం క్లీన్ ఆంధ్రప్రదేశ్, ఐఈసి కార్యాక్రమాల్లో భాగంగా మున్సిపల్ సిబ్బంది టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ సిబ్బందికి పట్టణ పారిశుధ్యంపై వివరించారు. రెండు బుట్టల విదానంలో వ్యర్థాలను చెత్త సేకరణ ఆటోలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందించారు. ఇండోర్ పట్టణమంత సుందరంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, ఎస్‌ఐ శివరామయ్య, పి.నాగేశ్వరరావు, కె.రాజ్యలక్ష్మి, శానిటరి సెక్రటరీలు, నగర దీపికలు పాల్గొన్నారు.

కూరగాయాల మార్కెట్‌కు అధునాతన భవనం

- రూ.163.61కోట్లతో ప్రభుత్వం అనుమతి
- వివరాలు వెల్లడించిన మేయర్ కావటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి
- యుజిడి పనులలో అక్రమాలపై సిఐడి విచారణ కోరతామని వెల్లడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని పివికె నాయుడు కూరగాయల మార్కెట్‌ను రూ. 163.61 కోట్లతో 8 అంతస్తుల సముదాయం నిర్మించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరం నడిబోడ్డులో బహుళ అంతస్తుల మోడల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టడం ఒక గొప్ప ఐకానిక్ ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. అలాగే ఆటోనగర్‌లో రూ. 11.89 కోట్లతో కబేళా నిర్మాణంకు కూడా అనుమతి ఇస్తూ ఉత్తర్వులు వచ్చాయని ఆయన తెలిపారు. గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.గత టిడిపి ప్రభుత్వ హయంలో గుంటూరు అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. యూజిడి పనులు అసంపూర్తిగా చేసి అనేక అవకతవకలకు పాల్పడ్డారని వీటిపై సిఐడి దర్యాప్తు కోరుతున్నట్టు ఆయన తెలిపారు. రూ.900 కోట్లతో చేపట్టిన యుజిడి పనులు పూర్తికాకపోగా నగరం మొత్తం రోడ్లు ధ్వంసం చేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చినే తరువాత ఈ రోడ్లను తిరిగి నిర్మిస్తున్నామని తెలిపారు. దేశంలో గుంటూరు నగరాన్ని అబివృద్ధిలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. నగరాన్ని కుల మత రాజకీయాలకతీతంగా మోడల్ నగరంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. పి.వి.కే నాయుడు మార్కెట్, అధునాతన కబేళాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంలో ప్రజాప్రతినిధులు అధికారులు సమిష్టి కృషి చేశారన్నారు. గుంటూరు నగరంలో తాగు నీటి అవసరాలు తీర్చేలా సమగ్ర తాగు నీటి పథకాన్ని వై.యస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో మంజూరు చేస్తే, ఆరోగ్య నగరంగా మార్చడంలో 16 వై.యస్.ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను సిఎం జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేశారన్నారు. టిడిపి హయంలో రాజధాని జిల్లాగా ప్రచారం చేసినా గుంటూరుకు ఒరిగింది ఏమీ లేదన్నారు. టిడిపికి బలంగా ఉన్న ప్రాంతాల్లో కూడా తామే రోడ్లు వేస్తున్నామని, ఎన్‌టిఆర్ స్టేడియం కూడా తమ హయంలోనే అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యు.జి.డి పేరుతో కేంద్ర నిధులను దోచుకున్నారని విమర్శించారు.

కమీషనర్ మాట్లాడుతూ అడవితక్కేల్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో యస్‌టిపి పనులు చివరి దశలో ఉన్నాయని, గోరంట్ల కొండమీద నుండి తాగు నీటి సరఫరా పనులు 10 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఎంఎల్‌ఏ ముస్తఫా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గుంటూరును రాజధానిగా ప్రకటించినప్పటికీ యుజిడి పేరుతో గుంతలూరుగా మార్చి, కేంద్ర ప్రభుత్వ నిధులను పంచుకున్నారని విమర్శించారు. యంయల్‌ఏ మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఎప్పుడూ లేని విధంగా 3 ఏళ్ళ నుండి పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్ర బాబు, షేక్ సజీల, నగర పాలక సంస్థ యస్.ఈ భాస్కర్, ఈ.ఈ సుందర రామి రెడ్డి పాల్గొన్నారు.

వర్సిటీ వేదికగా యువజనోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)







ఉత్సాహంతో ప్రతిభను చాటారు. అను సృజన పేరుతో జరుగుతున్న యువజన ఉత్సవాలలో సామాజిక కోణంలోనూ కొన్ని రకాల స్కిట్లు విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలలో విద్యార్థులు మరింత ఉత్సాహాన్ని పెంచే విధంగా మొదటి రోజు పోటీలు నిలిచాయి.ఈసందర్భంగా ప్రారంభ సభలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ పట్టేటి ప్రసంగించారు. ఈ నెల 15 వతేదీ నుండి 17 వతేదీ వరకు ఆచార్య నాగార్జునా యూనిర్శిటీలో జరుగుతున్న యువజనో త్సవాలలో భాగంగా మొదటి రోజు విశ్వవిద్యాలయం విద్యార్థుల కోలాహలంతో కన్నుల పండువగా మారిందని తెలిపారు. విద్యార్థుల మనో వికాసం కోసం దేనికైనా సిద్ధంగా విశ్వవిద్యాలయం ఉంటుందనీ, వారు తమలో దాగిన ప్రతిభా పాటవాలను వెలికి తీసి భవిష్యత్ లో విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పోటీలకు విస్తతమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. రెక్టార్ ఆచార్య పీ వరప్రసాద మూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఉంటుందని తెలిపారు. యువజనోత్సవాలలో 23 అంశాలలో జరిగిన పోటీలలో 1200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు.ప్రతీ విద్యార్థీ ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పోటీలలో పాల్గొనాలని కో ఆర్డినేటర్ ఆచార్య కే సునీత అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డా!భవనం నాగ కిషోర్ పిలుపునిచ్చారు.రిజిస్ట్రార్ ఆచార్య బీ కరుణ మాట్లాడుతూ విద్యార్థులంతా వివిధ కళలలో మంచి ప్రయోజకులుగా ఎదగాలని భవిష్యత్ ఉండాలని ఆకాంక్షించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినీ

17,18 తేదీల్లో చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆర్థికంగా వెనుక బడిన 16 ఏళ్ల లోపు బాలబాలికల గుండె సమస్యలపై ఉచితంగా పరీక్షలు చేసి శస్త్ర చికిత్సలు చేయిస్తామని చుక్కపల్లి శంకరరావు ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ చుక్కపల్లి రమేష్ తెలిపారు. గుంటూరులోని కమ్మజన సేవాసమితి ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా ప్రముఖ నిర్మాణ సంస్థ ఫోనిక్స్, స్టార్ హాస్పటల్, రెయిన్‌బో చిన్న పిల్లల గుండె జబ్బుల నివారణ సంస్థ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ 100 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆపరేషన్ ఖర్చు భరిస్తుందని, మిగతా ఖర్చు ఫోనిక్స్, స్టార్ హాస్పటల్, రెయిన్‌బో సంస్థలు భరిస్తాయని తెలిపారు. ఈనెల 17,18 తేదీల్లో బృందావన్ గార్డెన్స్ కమ్మజన సేవా సంస్థ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బాలబాలికలకు స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల్లో ఎవరికైనా గుండె సంబంధిత సమస్యలు ఉంటే ఆపరేషన్ అనివార్యమైతే వారిని హైదరాబాద్ తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని 16 ఏళ్ల లోపు బాలబాలికలు ఉన్న తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. విలేకరులసమావేశంలో చావా బోస్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

పాఠశాలల్లో బదిలీల జాతర

(మొదటి పేజీ తరువాయి)

రేషనలైజేషన్ పాయింట్లు సక్రమంగా అమలుచేయడంలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. తరగతుల విలీనం వల్ల బదిలీ అవుతున్న ఉపాధ్యాయులకు మాత్రమే కాక, జీఓ 117 ద్వారా రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులందరికీ పాయింట్లు ఇవ్వాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ నిలుపుదల చేయాలని కోరుతున్నారు. సాధారణ బదిలీలతో సంబంధంలేకుండా రాజకీయ సిఫార్సులతో జరిగిన బదిలీలపై రహస్యంగా జీవోలు వస్తున్నాయి. అంతేగాక ఖాళీల జాబితాపై ఇంకా అస్పష్టత నెలకొంది. పాఠశాలలో ఉన్న ఖాళీలను పూర్తిగా చూపిస్తారన్న నమ్మకం లేదనిబదిలీకి అర్హత ఉన్న ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయులకు రూపొందించిన రోస్టర్ పాయింట్ల అంశంపై కూడా వారిలో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. దరఖాస్తుకు శనివారం ఆఖరుతేదీగానిర్ణయించడం సరికాదని కనీసం రెండురోజులు గడువు పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ధ్రువీకరణ తప్పని సరి : డిఇఒ

ఉపాధ్యాయ బదిలీల్లో మెడికల్ గ్రౌండ్స్ కింద దరఖాస్తు చేసుకునే వారు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి సంబంధిత ధృవీకరణ పత్రం దాఖలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు గుంటూరు డిఈవో కార్యాలయంలో ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదులు చేసి రశీదు పొందాలని కోరారు.

చెత్తపన్నుపై సమరం

(మొదటి పేజీ తరువాయి)

కుమారి అధ్యక్షతన పట్టన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. దానిలో భాగంగానే చెత్త పన్నుతో పాటు నీటి మీటర్లు, ఇంటి పన్నుల పెంపు తదితర ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త పన్ను చెల్లించని వారికి సంక్షేమ పథకాలు నిలిపి వేస్తామని బెదిరించడం సరికాదన్నారు. దీనికి వ్యతిరేకంగా బాధితులతో కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. తాడేపల్లి పట్టణంలో సుమారు ఏడు వేల కుటుంబాలకు నివాస స్థలాలకు పట్టాలివ్వాలని కోరారు. ఇళ్లులేని నాలుగు వేల మందికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ అధికారులు ఇచ్చిన చెల్లుబాటు కాని కాగితాల స్థానంలో స్థలాలు, పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం మాటతప్పి విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. పట్టణంలో కొండ చుట్టూ ఉన్న సుమారు నాలుగు వేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణానది పక్కనే ఉన్న పట్టణంలో మూడు రోజుల ఒకసారి మంచినీరు వచ్చే ప్రాంతాలున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా ప్రజలందరికీ రెండు పూటలా మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిని వ్యతిరేకంగా సిపిఎం ఉద్యమిస్తుందని చెప్పారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో ఏటి అగ్రహారం రోడ్డు ఆధునీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. గురువారం ఏటి అగ్రహారం మెయిన్‌రోడ్డులో నూతనంగా చేపట్టనున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి; ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నగర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. నగరంలో షుమారు రూ.150 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్‌ఓబికి కూడా ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారు. మేయర్ మాట్లాడుతూ ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ అనేది అనేక ఏళ్ల నుండి ప్రజలకు ఉన్న ఆకాంక్ష అని తెలిపారు. రెండు వైపులా సిసి డ్రైన్, సెంట్రల్ డివైడర్, లైటింగ్‌తో షుమారు రూ.12 కోట్లతో ప్రధాన రహదారికి నూతన శోభను తీసుకురానున్నామన్నారు. కార్యక్రమంలో మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్.సజీలా, స్థానిక కార్పోరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, అందుగుల సంతోష్, ఎస్.ఈ. భాస్కర్, డిసిపి. కోటయ్య, ఈఈ. సుందర్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ తదితరులు



పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -పెదకూరపాడు

పేదలకు దుప్పట్లను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు భార్య వసంతకుమారి పంపిణీ చేశారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో . విద్యార్థులకు పుస్తకాలు వికలాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. జగన్ పుట్టినరోజు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్



పిల్లి ఏసుదాసు(ఫైల్)

పొన్నూరు పట్టణం జడవల్లి గ్రామనికి చెందిన పిల్లి. ఏసుదాసు(35) తండ్రి మునియ్య ఈ నెల 13న అదృశ్యం అయినట్లు భార్య ఝాన్సి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పిల్లి.ఏసుదాసు 13వ తేది ఉదయం 11 గంటలకు పొన్నూరు బ్యాంక్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్ళాడని అప్పటి నుంచి ఇంటికి తిరగి రాలేదని భార్య ఝాన్సీ పోలీసులకు తెలిపింది. పోలీసలు కేసు నమోదు చేసి ఆచూకి తెలిసిన వారు పొన్నూరు పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

వార్డు రెవెన్యూ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-తెనాలి

సచివాలయంలో అక్రమాలకు పాల్పడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డు రెవెన్యూ సెక్రటరీని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలి పట్టణంలోని 32 వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ సెక్రటరీగా పనిచేస్తున్న వై.నాగరాజుపై ఫేక్ రేషన్ కార్డులు జారీచేయటం, మహిళా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్థించటం, అసభ్య మెసేజ్‌లు పంపటం, బయో మెట్రిక్ ఉల్లంఘన వంటి ఆరోపణలున్నాయి. వాటిపై విచారణ నిర్వహించిన కలెక్టర్ అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తాడేపల్లి: ఎంటిఎంసి పరిధిలోని 13, 14 వార్డు సచివాలయాల్లో రాష్ట్ర మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, సమయపాలన గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడారు. సచివాలయాల పనితీరు, ఉద్యోగుల సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ వ్యవస్థ పట్ల సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తామని శ్రీలక్ష్మి తెలిపారు. పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలందించాలని ఉద్యోగులకు సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మీ

బలానికి మందని భార్యకు హెచ్ఐ ఇంజక్షన్

ప్రజాశక్తి-తాడేపల్లి



పోలీస్‌స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న బాధిత మహిళ

గర్భిణిగా ఉన్న తన భార్యకు బలానికి మందని భర్త హెచ్ఐ ఇంజక్షన్ చేయించిన సంఘటన తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలగులోకి వచ్చింది. వివరాల ప్రకారం వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. పెద్ద వాళ్లకు ఇష్టం లేకున్నా జీవితాంతం కలిసి ఉంటానని నమ్మించి ఒక్కటైయ్యారు. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. భర్త చరణ్‌కు మరో యువతితో పరిచయం ఏర్పడటంతో మరో రెండు నెలల్లో పండంటి బిడ్డను కనబోతున్న భార్యకు ఆర్ఎంపి డాక్టర్ సహాయంతో హెచ్ఐవి ఇంజక్షన్ చేయించాడు. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా, బలంగా పుడతాడని అందుకు బలం ఇంజక్షన్ అవసరమని ఈ దుర్మార్గానికి ఒడిగట్టాడు. రోజురోజుకు ఆమె ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టింది. దీంతో వైద్య పరీక్షల కోసం వెళ్లిన ఆమెకు నిజం తెలిసింది. పరీక్ష చేసిన డాక్టర్లు ఎయిడ్స్ పాజిటివ్ అని నిర్ధారించారు. తనను అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా తన జీవితాన్ని నాశనం చేసిన భర్త చరణ్‌పై గురువారం బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. తాడేపల్లి పోలీసులు చరణ్‌ను అదుపులోకి తీసుకుని కేసు విచారిస్తున్నారు



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 36,535
మిర్చి ఎగుమతి	: 35,490
మిర్చి నిల్వ	: 11,112

మిర్చి ధరలు

	రూపాయలలో
334	11500 - 25500
నెం.5	10500 - 24800
273	15000 - 20000
341	13000 - 27000
4884	12000 - 23000
సూపర్-10	21500 -21500
నాన్ ఎసి	
తేజ	10000 - 24300
బడిగి	15000 - 27500
దేవనూరు డీలక్స్	13800 - 26500
తాలుకాయలు	5,000 - 13,800
	ఎసి
334	13000 - 24000
నెం.5	19000 - 21000
తేజ	9500 - 22500
బడిగి	10000 - 26500
తాలుకాయలు	4,500 - 11,000

నేడు సిఐటియు పట్టణ మహాసభ

ప్రజాశక్తి -మంగళగిరి

సిఐటియు మంగళగిరి పట్టణ మహాసభ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో జరుగుతుందని సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్ తెలిపారు. మహాసభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ, సిఐటియు జిల్లా నాయకులు జె.వి. రాఘవులు, ఎస్ ఎస్ చేంగయ్యా తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

నేడు జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మద్యాహ్నం రెండు గంటలకు జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వేడుకల్లో తెనాలి యూనిట్ పరిధిలో 75 ఏళ్లు నిండిన 193 మంది పెన్షనర్స్‌ను సత్కరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులూ పాల్గొనాల్సిందిగా వారు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -మంగళగిరి :మంగళగిరి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ నారాయణ హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎస్సై నారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల ప్రతి ఏడాది ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్టులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం కరుణాకర్, డీన్ సిహెచ్ సురేష్, ఆర్ ఐ రామారావు, ఏజీఎం మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-తాడేపల్లి: ఉండవల్లిసెంటర్, గుంటూరు కెనాల్ కట్ట ప్రాంతంలో తాడేపల్లి పోలీసులు రాత్రిపూట విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈ ప్రాంతంలో బ్లేడ్‌బ్యాచ్ తిరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జన సంచారం లేని నిర్మానుష్య ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ శేషగిరిరావు హెచ్చరించారు.



ఉపాధ్యాయ బదిలీలపై అవగాహన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

ఈ నెల 14 నుండి ఉపాధ్యాయ బదిలీలు ప్రారంభమైన నేపథ్యంలో ఉపాధ్యాయులలో ఉన్న వివిధరకాల అనుమానాలను నివృత్తి చేసే ఉద్దేశంతో స్థానిక ఎంపిజెడ్పి పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ పిడుగురాళ్ళ శాఖ ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్షుడు పి.శివశంకర్ నేతృత్వంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధానకార్యదర్శి గుబ్బా విజయసారథి మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి వివిధ అంశాలను పూర్తి సమాచారం అందించామన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జమాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు షేక్ ఖాసీం పీరా, మండల ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ బాషా, కోశాధికారి ఎం.వి.సాంబశివరావు, రాజేష్ దయాకర్, సిలార్, విశ్వం, హనుమంతరావు, సుబ్బారావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు, విద్యార్థులకు వివిధ రకాల ఆన్లైన్,ఆఫ్ లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ బాజీ బాబు తెలిపారు. ఈ సందర్భంగా గురు వారం ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా మొదటి విడతగా వినుకొండ నియోజకవర్గంలో స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసి వాటి ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 2 వ విడత స్కిల్ హబ్స్ ను జనవరిలో ప్రారంభించి ఆయా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న వనరులు, పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపాధి అవకాశాలు ఉన్న రంగాలలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న యువతీ యువకులు వారి విద్యార్హత మేరకు ఆయా కోర్సులలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.



విజేతలైన విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిబిఆర్సి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ లో 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన,క్విజ్ పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు డిబిఆర్సి మహిళ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ,హెచ్ఎమ్ వి.పార్వతి, ఎపిఎమ్ బాలస్వామి సర్టిఫికెట్లు,బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎమ్ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో కూడిన విద్య, క్రీడలు,సామాజిక అంశాలపై ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వం, అవగాహన కలిగి ఉండాలన్నారు.

'చేతకాకపోతే బదిలీ చేయించుకోండి'

- యద్దపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం
- విద్యుత్ సమస్యలపై గళమెత్తిన ఎంపిటిసిలు
- ఏఈ తీరుపై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం పిపి ఝాన్సీ సాగర్



సమావేశంలో పాల్గొన్న ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తదితరులు

ప్రజాశక్తి- యద్లపాడు

అధికార, ప్రతిపక్ష పార్టీలన్న తేడా లేకుండా మండలంలోని అనేక గ్రామాల ఎంపిటిసి సభ్యులు విద్యుత్ సమస్యలపై సంబంధిత శాఖ ఏ.ఈ పై మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సాక్షిగా గళ మెత్తారు. యద్ల పాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపిపి ఝాన్సీ సాగర్ అధ్యక్షత వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి అంశాలను వివరించారు. చివరగా విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు మాట్లాడుతూ గ్రామాల్లో పనులు చేయాలంటే తమ శాఖ వద్ద నిధులు లేవని, పంచాయతిలు నిధులు సమకూరిస్తే పనులు చేపడతామని తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు బకాయిలు చెల్లించడంలేదని అన్నారు. కొన్ని గ్రామాల్లో అయితే మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై సొలస ఎంపిటిసి సభ్యుడు మద్దూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల్లో ఎవరూ ప్రస్తుతం బకాయిలు లేరని, గత ప్రభుత్వం ఎస్‌సి స్టేటస్ కుటుంబాలకు నెలకు కొంత మొత్తం ఉచిత విద్యుత్ ఇవ్వగా దానికి ప్రస్తుత టారీఫ్ ప్రకారం బకాయిలుగా పేర్కొంటున్నారని అన్నారు. కోట సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను రెం డేళ్లుగా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. యద్లపాడు ఎంపిటిసి సుభాని మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఎఈ వ్యక్తిగత వ్యవహారాలు మాను కుని ప్రజల కోసం పని చేయాలని సూచించారు. వారు చేసే పనులు మూలంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని, పని చేయడం చేతకాకపోతే వేరే ప్రదేశానికి బదిలీ చేయించుకోవాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ వచ్చే సర్వసభ్య సమావేశం లోపు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరష్కరించాలని ఏఈ ని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ హనుమారెడ్డి, ఎంఆర్ఒ నాగమల్లేశ్వరరావు,ఎంఇఒ అబ్బరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల బారినపడొద్దు



మాట్లాడుతున్న సచివాలయ మహిళా పోలీసు పావని

ప్రజాశక్తి-అమరావతి

లైంగిక వేధింపులకు గురిచేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సచివాలయ మహిళా పోలీసు పావని అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బిసి జూపూడి విద్యార్థులకు మంచి, చెడు అలవాట్లపై ఆమె అవగాహన కల్పించారు. కన్సిస్టెంట్ రిథమ్‌లో భాగంగా ఆమె గురువారం పాఠశాలను సందర్శించారు. లైంగిక వేధింపుల బారిన పడకుండా కాపాడు కోవాలంటే అత్యవసర సమయాలలో 100,1098,181,108 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేస్తే రక్షణ పొందేందుకు వీలు కలుగు తుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ల్యాప్ ట్యాప్‌లో కొన్ని వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఏ విషయంలోనైనా అసౌకర్యానికి గురైనట్లయితే విద్యార్థులు తమ సమస్యను ఒక పేపరులో రాసి పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్సులో వేయాలని చెప్పారు. గైర్హాజరయ్యే విద్యార్థుల గురించి ఎప్ప టికప్పుడు సమాచారం అందించాలని ఉపా ధ్యాయులకు సూచించారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.పద్మ, ప్రధానోపాధ్యాయులు బి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు అలివేలు మంగమ్మ, ఎండి గౌషియ సుల్తానా పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

రక్తదానంపై అవగాహన పెంపొందించుకోండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

రక్తదానంపై విద్యార్థులు అవగాహన పెంపొందించు కోవాలని రాష్ట్ర మంత్రి అంబటి రాం బాబు అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యా లయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమా వేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ పితామహుడు పొట్టి శ్రీరాముల వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల 29 న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగ న్మోహనరెడ్డి పుట్టిన రోజును పుర స్కరించుకొని 'రక్తదానం చేద్దాం జగనన్నకి శుభా కాంక్షలు చెపుదాం' అనే నినాదంతో ఏర్పాటు చేయ నున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతమయ్యేలా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారికి ప్రత్యేక ధృవీ కరణ పత్రాన్ని అందివ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెన్షన్ పెంపులో భాగంగా జనవరి 1న స్థానిక 1వ వార్డులో రూ. 2,750 పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి యేట ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్న సంక్రాంతి ముగ్గుల పోటీలను అత్యంత వైభవంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్. రాజనారాయణ, డాక్టర్లు గీతా హాసంతి, జి.నాగభూషణ రెడ్డి, సిహెచ్ సాంబశివరావు, అచ్యుత శివ ప్రసాదు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగుల మీరాన్, కోటేశ్వరరావు నాయక్ తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుశీల్ మీడియా డైరెక్టర్‌సుశీల్ కుమార్ తదితరులు

18న 'రంగస్థలి' ఆధ్వర్యంలో మ్యూజికల్ పోటీలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఈ నెల 18న నరసరావుపేట రంగస్థలి, సుశీల్ మీడియా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్వహణలో మ్యూజిక్ కార్నివాల్ సంగీత, నృత్య , కామెడీ స్కిట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సుశీల్ మీడియా డైరెక్టర్ డాక్టర్ సుశీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగే ఈ పోటీలకు హై స్కూల్ విద్యార్థులు, కళాశాల స్థాయి విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రకాష్‌నగర్ లోని టౌన్ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పోటీలు 18వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పట్టణంలోని టౌన్ హాల్‌లో నిర్వహిస్తారని రంగస్థలి అధ్యక్షులు బాజీ తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రంగస్థలి ప్రధాన కార్యదర్శి బోసు, ప్రసన్న కుమార్ శ్రీనివాస, మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-ఈపూరు



చుండూరు రాఘవమ్మ

శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి చుండూరు వెంకటేశ్వర్లు భార్య, మాజీ సర్పంచ్ చుండూరు రాఘవమ్మ (59) విద్యుత్ షాక్ తో గురువారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాఘవమ్మ ఇంటి పనులలో భాగంగా గురువారం సాయం త్రం మిక్సీలో పిండి వేసే క్రమంలో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గా నియమితులైన రాఘవమ్మ ఈ నెల 19న ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. రాఘవమ్మ మృతితో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మరణవార్త తెలియగానే మండలంలోని గ్రామాల ప్రజలు రాఘవమ్మను కడసారి చూసేం దుకు తరలివచ్చారు.ఆమె అంత్యక్రియలు శనివారం నిర్వహించను న్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త వెంకటేశ్వర్లు శావ ల్యాపురం మండల పరిషత్ అధ్యక్షునిగా, కారుమంచి సర్పంచ్‌గా, వైసిపి మండల కన్వీనర్‌గా పనిచేశారు. వెంకటేశ్వర్లు, రాఘవమ్మ దంపతులకు కుమారుడు ఉన్నాడు. ఉద్యోగరీత్యా విదేశాలలో ఉన్నాడు.

మంగళగిరిలో ఇన్ఫినిటీ ఫిట్నెస్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి -మంగళగిరి



మంగళగిరి ఆటో నగర్ గౌతమబుద్ధ రోడ్డు కెనరా బ్యాంక్ పైన నూతనంగా నిర్మించిన ఇన్ఫినిటీ ఫిట్నెస్ జిమ్ సెంటర్ను గురువారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆధునిక కాలంలో ప్రజలకు ఆరోగ్యం పై మక్కువ పెరిగిందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో యువతతో పాటు మధ్య వయస్కులు, మహిళలకు అత్యాధునిక హంగులతో అన్ని సౌకర్యాలతో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆరోగ్యాభిలాషులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ మునగపాటి వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ రాష్ట్రచేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి, జిమ్ నిర్వహకులు వంగర శ్రీనివాస్, బండారు తిరుమల వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



ఎకో పార్కును సందర్శించిన అటవీశాఖాధికారులు

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి ఫారెస్ట్ ఎకో పార్కును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వై. మధుసూదన రెడ్డి గురువారం సందర్శించారు. ఎకో పార్కు లో మరిన్ని సౌకర్యాలు కలించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. యోగా చేసేందుకు అతి త్వరలో నిర్మాణం పూర్తి చేస్తామని అందుకు వాకర్స్ సహకారం అందించాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతు తమ సహకారం తప్పక ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు వై. శ్రీనివాస రెడ్డి, కే. మహబూబ్ బాషా తదితరులు వున్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు


కార్మికుల హక్కులు కాలరాస్తున్న పాలకులు

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

20,21 తేదీలలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తెనాలి : ఈనెల 20, 21 తేదీలలో అనంతపురంలో జరిగే ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.గురువారం స్థానిక చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా 11వ మహాసభ బి.ముత్యాల రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వంతపాడుతున్నాయని ఎద్దేవా చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని విమర్శించారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఈ విషయాలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జ్యోతిబసు, మున్సిపల్ శ్రామిక మహిళ కన్వీనర్ యం. శివలక్ష్మి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రామచంద్రరావు, అధ్యక్షులు బి.ముత్యాలరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.చెంగయ్య, పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకూరు రమేష్ బాబు, తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, యూనియన్ తెనాలి పట్టణ కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, జిల్లాలోని వివిధ మున్సిపాలిటీల నుండి కార్మికులు పాల్గొన్నారు.

మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా నియమించాలి

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చిన సందర్భంలో అప్పటి వరకు ఆ సెంటర్లో పని చేసిన మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా నియమించాలని ఏ.పి.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. రమా సుష్మ, పి. దీప్తి మనోజ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మినీ అంగన్వాడీ కేంద్రాలలో సుదీర్ఘకాలం నుండి పనిచేస్తున్న మినీ వర్కర్లు హెల్పర్ జీతంతో వర్కరు, హెల్పర్ ఇద్దరి పనులను నిర్వహిస్తున్నారు. జనాభా పెరిగిన నేపథ్యంలో మినీ సెంటర్లను అప్ గ్రేడ్ చేసి మెయిన్ సెంటర్లుగా మార్చేందుకు జిల్లాలో ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు అధికారుల వద్దకు చేరాయి. అర్హత ఉన్న మిగిలిన మినీ సెంటర్లను కూడా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. అప్ గ్రేడ్ చేసిన సందర్భంగా సుదీర్ఘ కాలం నుండి అప్పటివరకు అనేక వ్యయ,ప్రయాసలతో విధులు నిర్వర్తించిన మినీ వర్కర్లను హెల్పర్లుగా పరిగణించడం అన్యాయమన్నారు. అర్హత ఉన్న మినీ వర్కర్లను ఆ కేంద్రంలో మెయిన్ వర్కర్లుగా నియమించి, హెల్పర్లను కొత్తగా నియమించేందుకు ప్రభుత్వం తగిన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వై. నేతాజీ

ఐక్య ఉద్యమాలతో కార్మికుల సమస్యలు పరిష్కారం

పెదకాకాని మండల మహాసభలో వై. నేతాజీ - 13 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి - మంగళగిరి

వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, స్కీమ్ వర్కర్లు సంఘటితంగా ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. పెదకాకాని మండల సిఐటియు మహాసభ గురువారం పెదకాకాని గ్రామంలోని సుందరయ్య నగర్లోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. మహాసభకు డి నరసింహారావు అధ్యక్షత వహించారు. నేతాజీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ యానిమేటర్లు, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు ప్రభుత్వం జీతాలు చెల్లించిన చెల్లించకపోయిన విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సకాలంలో జీతాలు చెల్లించమని ప్రశ్నిస్తే మాత్రం వైసిపి ప్రభుత్వం అణిచివేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే అందరి వేతనాలు పెంచుతానని మాట ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. పంచాయతీ కార్మికులు నెలల తరబడి పనులు చేస్తున్నప్పటికీ వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తానని చెప్పి జగన్ హన్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు. సంఘటితంగా ఉండి పోరాటాలు చేసిన మండలాల్లో వేతనాలు చెల్లించడం జరిగిందని అన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించే చలో అసెంబ్లీకి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మహాసభ నివేదికను ప్రవేశపెట్టి ప్రసంగించారు. మహాసభలో వివిధ రంగాల చెందిన కార్మికుల పాల్గొని ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందుల గురించి వివరించారు.

13 మందితో నూతన కమిటీ

అనంతరం 13 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కే కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా డి నరసింహారావు, ఉపాధ్యక్షులుగా కే కనకవల్లి, కార్యదర్శిగా కే కోటేశ్వరమ్మ, కోశాధికారిగా కే పద్మ ఎన్నికయ్యారు.

నిరంకుశంగా ప్రభుత్వ తీరు

మేడికొండూరు మండల మహాసభలో బి.లక్ష్మణరావు

14 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి - మేడికొండూరు



మేడికొండూరు సభలో మాట్లాడుతున్న బి. లక్ష్మణరావు

రాష్ట్రంలో నిరంకుశంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య యుతంగా చేస్తున్న నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదని నిర్బంధాలతో ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచి వేయాలని చూస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు అన్నారు. గురువారం సిఐటియు మండల మహాసభ మేడికొండూరు యన్.టి.ఆర్ నగర్ లోని పాఠశాలలో నిర్వహించారు. ఈ మహాసభకు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జమీలా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ జరుగుతున్న ఉద్యమంలో ప్రభుత్వం భాగ స్వామి కావడం లేదని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వైసిపి, టిడిపిలు ప్రశ్నించకుండా కేంద్ర ప్రభుత్వం వద్ద లొంగు బాటు కార్మిక, కర్షక, ప్రజా సమస్యలు గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా రంగాల్లో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి సిఐటియు అండగా ఉంటుం దన్నారు. కౌలు రైతులు సంఘం మండల నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు సర్వస్వం అన్నట్లుగా అభి వృద్ధికి ఎటువంటి ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు.

14 మందితో నూతన కమిటీ

సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ భాషా, తలారి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా బాబు, రవీంద్ర, ఉపాధ్యక్షులుగా ధనలక్ష్మీ, జమీల్యా, ఖాజా సహా 14మందితో నూతన కమిటీ ఎన్నికయ్యారు.



అథ్లెటిక్స్‌లో బిఎస్ఎస్‌బి కళాశాలకు రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి - తాడికొండ

ఆచార్య నాగార్జున వర్సిటీలో డిసెంబర్ 10-15 తేదీలలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో తమ కళాశాల విద్యార్థులు రెండు బంగారు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంఎస్ లత గురువారం తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెంలో బిఎ విద్యార్థులు అయ్యప్ప ప్రసాద్, జిఎస్‌విఎస్ఎస్ మౌనిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారన్నారు. ఫిజికల్ డైరెక్టరు ఎ.వి.రాఘవయ్య మాట్లాడుతు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ 2022-2023 అథ్లెటిక్ పోటీలలో అయప్ప, మౌనిక అత్యుత్తమ వేగంతో పరుగు తీసినందుకుగాను ఉత్తమ క్రీడాకారుడు ఉత్తమ మహిళా క్రీడాకారిణిగా ఇరువురికీ గుర్తింపు లభించిందని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ స్వామి నాథన్, బి శేషగిరిరావు, రాఘవయ్య, ఆర్ నాగమణి, ఎం.సురేష్ విద్యార్థులను అభినందించారు.


మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

కార్మికుల తొలగింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

తాడికొండ మండల మహాసభలో దండా లక్ష్మీనారాయణ

12 మందితో తాడికొండ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -తాడికొండ

మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ పేరుతో కార్మికులను తొలగించే పనిలో అధికారులున్నారని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం తాడికొండ పాత సినిమాహాల్ లో సిఐటియు మండల మహాసభ లో ఆయన మాట్లాడారు. మినీ అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న వారు తక్కువ జీతానికి అంగన్వాడీ కార్యకర్త చేసే పనినే చేస్తుంటే, ఇప్పుడు మినీ అంగన్వాడీ కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి పని చేస్తున్న వారిని తొలగించి క్రొత్తవారికి పోస్టింగ్ ఇచ్చే ప్రత్తిపాదన తెస్తున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిని అధికారులు ఎమ్మెల్యే వద్దకు వెళ్ళి లెటర్ తెచ్చుకోవాలని సూచిస్తున్నారని, అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టవలసిన అధికారులు ఎమ్మెల్యేల వద్ద లెటర్ తెచ్చుకోమని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఈ ప్రత్తిపాదనను ఉపసం మహరించుకోవాలన్నారు. కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచి, పంచాయతీ వర్కర్స్ టెండర్ విధానని రద్దు చేసి పెర్మనెంట్ చేయాలని, స్కీం వర్కర్స్ ను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేసారు. ఈ నెల 18,19 తేదీలలో జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలాని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యడ్లపల్లి గాంధీ రామ్ మోహనరావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బాయమ్మ, అన్నామణ తదితరులు పాల్గొన్నారు.

12 మందితో నూతన కమిటీ

అనంతరం 12 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సుబ్బాయమ్మ, వై గాంధీ రామ్మోహనరావు, ఉపాధ్యక్షులుగా జ్యోతి, కర్రీ ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా నారాయణమ్మ, కోశాధికారిగా ఎస్ శ్రీనివాసరావు, మరో 5గురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి- విలేకరులయంత్రాంగం

అమరజీవి పొట్టిశ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా గురువారం ఆయనకు ఘన నివాళులర్పించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్య క్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పాల్గొని నివాళులర్పించారు. దేశంలో భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి అనిర్వచనీయమని కొనియాడారు. పొట్టి శ్రీరాములు సేవా సమితి వారి ఆధ్వర్యంలో స్థానిక శివుని బొమ్మ సెంటర్ వద్ద పొట్టి శ్రీరాములు, దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహాలకు కలెక్టర్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఆమరణ నిరహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను నేటి విద్యార్థులు తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వినుకొండలోని పెద్ద మార్కెట్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కజ్జాయం. విజయలక్ష్మి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రొంపిచర్లలోని తహశీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాచర్లలోని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.అమరజీవి పొట్టి శ్రీరాముల చరిత్ర భావి తరాలకు తెలియజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహనికి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరావతి మండల టిడిపి ఆధ్వర్యంలో అమరావతి ప్రధాన రహదారిలోని గ్రామ కచేరి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి టిడిపి శ్రేణులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కన్యధార వసంతరావు మాట్లాడారు. అమరావతి మండలపరిధిలోని మునుగోడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. అంతకు ముందు సర్దార్ వల్లభాయి పటేల్ వర్థంతి సందర్భంగా పాఠశాలలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిలకలూరిపేటలోని స్థానిక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు



ఆరోగ్యశ్రీ ఉన్న ఆసుపత్రిలోనే వైద్యం

ప్రజాశక్తి- వినుకొండ: ఆరోగ్యశ్రీ అనుమతులు ఉన్న ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 41 మంది బాధి తులకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.41 మంది బాధితులకు 31 లక్ష 87 వేల రూపాయలు అందజసినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

బిసి వెల్ఫేర్ కార్పొరేషన్ కమిటి సభ్యుడిగా వేముల శివ



ప్రజాశక్తి-నరసరావుపేట: పల్నాడు జిల్లా బిసి వెల్ఫేర్ కార్పొరేషన్ కమిటి మెంబర్ గా వేముల శివ నియ మితుల య్యారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సం దర్భంగా వేముల శివను వైసిపి నాయకులు, బిసి సంఘాల నాయకులు అభినందించారు.



ప్రాంగణ ఎంపికల్లో 'ఏఎంరెడ్డి' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట: చెన్నైకు చెందిన ఏపీ సోర్స్ కంపెనీ ఫార్మసీరంగంలో సాఫ్ట్వేర్ కోడింగ్ విభాగంలో మండలంలోని పెట్లూరి వారిపాలెం గ్రామ పరిధిలో గల ఏ.ఎం.రెడ్డి కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో విద్యార్థులు 46 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి గురువారం తెలిపారు. ప్రాం గణ ఎంపికల్లో 116 మంది విద్యార్థులు పాల్గొనగా మౌఖిక, వ్రాత, హెచ్ఆర్ ఇంట ర్వ్యూలలో 46 మంది ఉద్యోగాలు సాధించారని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు శిక్షణా కాలంలో రూ. 1.92 లక్షలు శిక్షణ అనంతరం అత్యధిక వేత నం అందుకుంటారని తెలి పారు. ఈ సందర్భంగా కళా శాలలో ఏర్పాటు చేసిన అభి నందన సభలో విద్యార్థులను అభినందించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్ భూషణ్, ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ కె.లక్ష్మీసురేఖ, కళాశాల ఏఓ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి-నరసరావుపేట: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధన్ బాబు డిమాండ్ చేశారు.గురువారం నరసరావుపేట మండలంలోని పంట పొలాలను పరిశీలించారు.

విద్యార్థుల్లో పరిశోధనా స్థాయి పెంపొందించాలి

ప్రజాశక్తి-శావల్యాపురం: విద్యార్థుల్లో పరిశోధన స్థాయి పెంపొందించే దిశగా సైన్స్ ఉపాధ్యాయులు విశేష కృషి చేయాలని ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింఛన్‌దారుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-వినుకొండ: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల దినోత్సవం వేడుకలు గురువారం పింఛనుదారుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం యొక్క పథకాన్ని అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆవి ష్కరించారు. అనంతరం కార్యదర్శి కృష్ణమూర్తి 2022 సంవత్సరం ఆర్థిక నివేదికను సభలో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది.

'విద్యుత్ పొదుపు..ప్రగతికి మలుపు'

ప్రజాశక్తి-మాచర్ల

నేటి సమాజానికి విద్యుత్ అవసరం ఎంతో ఉందని ఇఇ హరిబాబు అన్నారు. గురువారం ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పట్టణంలో గురువారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ హరి బాబు మాట్లాడుతూ సహజ వనరులను ఉపయోగించి విద్యుత్‌ను తయారు చేస్తామన్నారు. విద్యుత్‌ను అవసరం మేరకు పొదుపుగా వాడడం వలన భవిష్యత్ తరాలకు సహజ వనరులు అందుబాటులో ఉంటాయన్నారు. దీంతో పాటు పర్యావరణాన్ని కూడ కాపాడినట్లు అవుతుందన్నారు. విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు అని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డిఇఇ రామయ్య, ఎఇలు రాంబాబు, ఆంజనేయులు, రామేశ్వర నాయక్ పాల్గొన్నారు.



ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ర్యాలీ

సాగర్ కుడి కాలువ బ్రిడ్జిపై మళ్లీ రంధ్రం



ప్రజాశక్తి- కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని వినుకొండ రోడ్డులో ఉన్న నాగార్జున సాగర్ కుడి కాలువ బ్రిడ్జిపై రంధ్రం పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గత ఆరు నెలల క్రితం ఇదేవిధంగా రంధ్రం పడటంతో ఎన్ఎస్‌పి అధికారులు తూతూ మంత్రంగా రం ధ్రాలను పూడ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో బ్రిడ్జిపై మళ్లీ రం ధ్రం పడటంతో పలువురు వాహనదారులు,ప్రజలు విమర్శలు గుప్పి స్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

18 ,19లలో సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అచ్చంపేట

ఈ నెల 18 19 తేదీల్లో వినుకొండలో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు అన్నారు గురువారం అచ్చంపేట మండలం మహాసభను వీఆర్ఏల సంఘం ఆఫీసు వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వాల విధా నాల వల్ల కుటుంబ ఖర్చులు పెరిగి ఇస్తున్న వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నారని ఇటువంటి విధా నాలను కార్మిక వర్గం ఐక్యంగా ఉండి వ్యతిరేకించాలని కోరారు. ఐక్య ఉద్యమాలు చేయడానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలన్నారు. అనంతరం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శిలుగా పోసిపోగు ప్రసాదు, కె.కుమా రిలను కమిటీ సభ్యులుగా కోట సుబ్బారావు, మౌలాలి, దేవదానం,రాణి మరో మూడు కో ఆప్షన్స్ సభ్యులతో 9 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మండల మహాసభలో మాట్లాడుతున్న జి. రవిబాబు

'ఆశా' ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీ నిమిత్తం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రముల వైద్యాధికారులు డాక్టర్ స్వాతి, డాక్టర్ మురళీధర్ లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలో రొంపిచర్ల ఆరోగ్య ఉపకేంద్రంలో1, బుచ్చిపాపన్నపాలెంలో1, సుబ్బయ్యపాలెంలో 1, కొనకంచివారిపాలెంలో 1 పోస్టు కలిపి మొత్తం 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో వి.రెడ్డిపాలెం ఆరోగ్య ఉపకేంద్రం లో 3, సం తగుడిపాడులో 1, కొత్తపల్లిలో 1 కలిపి మొత్తం 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసు కోవాలని, వివరాలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

శనగ, మిర్చి పొలాల సందర్శన

ప్రజాశక్తి-చిలకలూరిపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట వ్యవసాయ శిక్షణ కో ఆర్డినేటర్ ఎం.శివకుమారి, మండల ఈ.ఈ.ఓ.,వి.ఏ.ఏలు కలిసి మండలి పరిధిలో గల రాజాపేట గ్రామంలో శనగ, మిర్చి పొలా లను గురువారం సందర్శించడం జరిగిందని మండల వ్యవ సాయ అధికారి శ్రీ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు శనగలు ఎదు గుదల తక్కువగా ఉన్నందున 19:19:19 గాని లేదా మల్టీకే ఒక లీటర్ నీటికి 5 గ్రాములు చొప్పున పిచ్చికారి చేయాలని సూచించినట్లు తెలిపారు.

'ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించొద్దు'

ప్రజాశక్తి-మాచర్ల: పట్టణంలో విశాలమైన తారురోడ్లు ఉన్నా యని, ప్రజలు అవగాహనతో రహదారులపై రాకపోకలు సాగిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అర్బన్ సిఐ బాలకృష్ణ అన్నారు. పట్టణంలో ఆయన ట్రాఫిక్ క్లియరెన్స్ కార్యక్రమంలో పాలొ ్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారు రోడ్డుపై అన వసరంగా వాహనాలు నిలి పితే కేసులు నమోదు చేసి పెనాల్టీలు వేస్తామన్నారు. లోడింగ్, అన్ లోడింగ్ కూడా వ్యాపారులు అనుమతించిన సమయాలలో నిర్వ హించుకోవాలన్నారు. అర్బన్ ఎస్.ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో 'రోటరి' కీలకపాత్ర

ప్రజాశక్తి-చిలకలూరిపేట: వైద్య సేవలు, సామాజిక సేవలు అందించడంలో రోటరి సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని రోటరీ జిల్లా 3150 గవర్నర్ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్.అర్.టి. కాలనీలోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ అధికార పర్యటనలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ చిలక లూరిపేటకు వచ్చిన అయన పాల్గొని ప్రసం గించారు. అనంతవరం గ్రామం స్వాగత బోర్డులను ప్రారంభించి, విద్యార్థులకు నోట్ బుక్స్, భోజనం ప్లేట్లు, రైతులకు తైవాన్ స్ప్రేయర్లు అందజేశారు. ఈ సందర్భంగా దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

సచివాలయ సిబ్బంది ఆదర్శవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి- అమరావతి: మండల పరిధిలోని ధరణికోట-1, ధరణి కోట-2 సచివాలయంలలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, అమరావతి ఎంపిపి మేకల హనుమంతరావు గురువారం ఆక స్మిక తనిఖీలు నిర్వహించారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హనుమంతరావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఆదర్శవంతంగా పనిచేయాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు.

గ్రామాల్లోకి వెళ్లి సమస్యలుపరిశీలించాలి

ప్రజాశక్తి-రాజుపాలెం: అధికారులు జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలు ను గ్రామలలోకి వెళ్లి పరిశీలించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు తెలకుట్ల రాజేశ్వరి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అంగన్ వాడిలో అందించే పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. ముందుగా వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సూర్య మండలం

ప్రజాశక్తి-బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో సూర్య మండలం మోడల్‌లోని పలు రకాల ఆహార ఉత్పత్తులు తినటం వలన ఆరోగ్యంగా ఉంటుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సూర్య మండలం మోడల్ ను మండలంలోని నాగిరెడ్డి పాలెంలో రైతు కె.జ్యోతి 28 రకాల దుంప, తీగ ,పండ్లు ,కూరగాయలు , ఆకుకూరలు, పూలు ఆహార ఉత్పత్తులను సాగు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా అడపా మోహన్ రావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన అడపా మోహన్‌రావును పలు సంఘల నాయకులు గురువారం అభినందించారు. స్థానిక ఎన్.ఆర్.టి. సెంటర్‌లోని వారి కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రతి పౌరుడికి రాజ్యా ంగంలోని హక్కులు దక్కాలన్న కృత నిశ్చయంతో మోహన్ ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని, ఆయన జీవితం ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరామల 70వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక నగరపాలక సంస్థ విశ్రాంతి గృహం వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధరరావు, నగర కమిషనర్ కీర్తి చేకూరి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలు, స్ఫూర్తిని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత తెలుగు ప్రజలందరిపై ఉందన్నారు. రాష్ట్రం యావత్తు ఆయన ఆశయాలను గుర్తు చేసుకుంటుందన్నారు. దేశ స్వాతంత్ర సమరంలో ఆయన క్రియాశీలక పాత్ర వహించి, స్వాతంత్ర్యానంతరం దేశంలో అనేక భాషలు వున్నాయని గ్రహించి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అవసరమని గుర్తించి, భాష ప్రాతిపదికగా రాష్ట్రం ఏర్పడాలన్న లక్ష్యంతో అకుంఠిత ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారన్నారు.ఆయన ప్రాణత్యాగం ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డిడి మధుసూధనరావు, వివిధ బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫర్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, జెడ్పి సిఇఒ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

మార్కెట్ సెంటర్..గుంటూరు నగరంలోని మార్కెట్ సెంటర్ వద్ద గల పొట్టిశ్రీరాముల విగ్రహానికి పలువురు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి , ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్,స్థానిక కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరి రాజేష్,డివిజన్ అధ్యక్షులు కంతేటి శ్యామ్ శేఖర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కొల్లిపర: స్థానిక ఆర్యవైశ్య సంఘ నిలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి తహశీల్దార్ నాంచారయ్య పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు ఈ సందర్భంగా పలువురు వక్తలు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు చేసిన కృషిని కొనియాడారు ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు సోమిశెట్టి సురేష్ గ్రామ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు అన్నవరపు రమేష్ బొల్లి శెట్టి హరీష్ సుగ్గల క్రాంతి కోడూరు అనిల్ ఆర్యవైశ్య సంఘ సభ్యులుపాల్గొన్నారు

పెదనందిపాడు రూరల్. : కాకుమాను మండలం అప్పాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్పర్సన్ దోనపాటి సుప్రియ,ఉపాధ్యాయని మహమ్మద్ షహనాజ్ బేగం, అంగన్వాడి టీచర్ పొందుగల ఎస్తేరు, ఆయా శివమ్మ, ఏసమ్మ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి టి గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 52 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగి జె చిరంజీవి,విశ్వేశ్వర రావు,బండి చంద్రశేఖర్ పాల్గొన్నారు.


గుంటూరులో నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు


కొల్లిపరలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు


తుళ్లూరులో నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి గిరిధర్ కుమార్



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నిడమర్రు విద్యార్థులు

మంగళగిరి రూరల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు నిడమర్రు జడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్ 14,17 ఖోఖో పోటీలు ఈ నెల 17 నుండి 19 వరకు కుతుకులూరు, విశాఖపట్టణంలలో నిర్వహించనున్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు గురువారం నిడమర్రులోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీమ్‌ను ఎంపిక చేశారు. అండర్ 14 విభాగం నుండి 8వ తరగతి చదువుతున్న కావ్య శ్రీ, రాజశేఖర్, అండర్ 17 విభాగం నుండి పదవ తరగతి చదువుతున్న నీలిమ,సందీప్‌లు ఎంపికయ్యారు. పాఠశాల పిడి రవి కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల నుండి 600 మంది క్రీడాకారులు ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. ఖోఖో పోటీలకు జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు ఎంపిక పట్ల గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తేజస్విప్రఖ్యకు మిజోరాం గవర్నర్ ప్రశంస

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రశంసలందుకుంది. ప్రఖ్య వివిధ రాష్ట్రాల్లో ప్రముఖ పండుగలు, ఉత్సవాల కార్యక్రమాల్లో తన నృత్యాన్ని ప్రదర్శిస్తూ ఎంతో ఆదరణ పొందుతోంది. ఈ నేపథ్యంలో వివిద కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గురువారం విశాఖపట్నం వచ్చిన గవర్నర్ అక్కడి సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రఖ్య నృత్యాన్ని మెచ్చుకున్నారు. తెనాలి కళా సంపదకు చిహ్నంగా ప్రఖ్య నృత్యం ఉందంటూ ప్రశంసించి, సత్కరించినట్లు దర్శకులు దిలీప్‌రాజా తెలిపారు.



ప్రఖ్యను సత్కరిస్తున్న మిజోరాం గవర్నర్ హరిబాబు



ఉచిత వైద్య శిబిరంలో 250 వైద్య పరీక్షలు

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

కెల్ విశ్వవిద్యాలయంలో రెడ్ క్రాస్ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గురువారం ఫార్మసీ కళాశాల, ఆంధ్రా హాస్పిటల్ వైద్యులతో కలిసి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీన్ విద్యార్థి వ్యవహారాలు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ ప్రారంభించారు. రోగులకు రక్తంలో గ్లూకోజ్, రక్తపోటు, గుండె , కిడ్నీ వ్యాధులకు ఎకో పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 250 మందికి పైగా ప్రజలు రోగ నిర్ధారణ చేయించుకుని మందులు తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్.జి.పార్థసారథివర్మ, ప్రో.వైస్ చాన్సలర్ డాక్టర్. ఎన్.వెంకటరామ్ , రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ , విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, కార్యక్రమాల విస్తరణ అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రవీంద్రనాథ్, రెడ్ క్రాస్ యువత ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ .పి. గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


గొడవర్రులో కొనుగోలు చేసిన ధాన్యం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయటం ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి పి శిరీష తెలిపారు. ఇప్పటివరకు చిలువూరు, గోడవర్రు గ్రామాల్లో దాదాపు 700 బస్తాలు కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు.17శాతం కన్నా ఎక్కువగా తేమ ఉన్నట్లయితే ప్రతి క్వింటాకు ఒక శాతానికి ఒక్క కేజీ తరుగుదల కింద తీసివేస్తారని తెలిపారు. శుక్రవారం ఈమని గ్రామంలో కొనుగోలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మొలకెత్తిన ధాన్యం గురించి ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎటువంటి సమాచారం రాలేదన్నారు.


శానిటరి విభాగం సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పారిశుధ్యం నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో పారిశుధ్య విభాగం చిత్తశుద్ధితో పనిచేయాలని, నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని కమిషనర్ ఎం.జస్వంతరావు అన్నారు. పట్టణంలోని 1,2,9 శానిటరీ డివిజన్ కార్యాలయాలను గురువారం ఆయన పరిశీలించారు. కొందరు సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాని పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరి డివిజన్ కార్యాలయాల్లో సిబ్బంది, కార్మికుల హాజరు, వారి పనితీరును సమీక్షించినట్లు చెప్పారు. అలాగే ఇంటింటి చెత్తసేకరణపై కార్మికులకు పలు సూచనలు చేశారు. చికెన్, మటన్, ఫిష్ స్టాల్స్, టీ స్టాల్స్ నిర్వాహకులు వ్యర్థాలను రోడ్లపై వేయకుండా, ప్రత్యేకంగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకుని, వ్యర్థాలను చెత్తసేకరణ ఆటోలకు అందించాలని కోరారు. చెత్తసేకరణకు విధించిన యూజర్ చార్జీలను ప్రతి ఒక్కరూ చెల్లించి, పురపాలక సంఘానికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు. ఆయన వెంట శానిటరి విభాగం సిబ్బంది ఉన్నారు.


కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

విద్యార్థులలో క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత వంటివి పెంపొందించుకోవాలని పెదనందిపాడు కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంతి విజిలెన్స్ ఏఎస్‌పి కాళహస్తి సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ వయసులోనే కెరీర్ గురించి ముందు చూపుతో ఆలోచించాలన్నారు, క్రమశిక్షణ, చెడు వ్యసనాల పట్ల దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పెదనందిపాడు ఏఎస్ఐ ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలేజీలో ర్యాగింగ్, ఇతర ఆసాంఘిక కార్యక్రమాల పట్ల విద్యార్థులు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి వీరరాఘవయ్య అధ్యాపకులు ,సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీనివాసరాజును సత్కరిస్తున్న శతాబ్ధి ఉత్సవ కమిటీ

కళాకారుడు శ్రీనివాసరాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్టీఆర్ శతాబ్ధి ఉత్సవాలు కళాకారులకు రెట్టింపు గుర్తింపునిస్తున్నాయని ప్రముఖ రంగస్థల కళాకారుడు పూసపాటి శ్రీనివాసరాజు అన్నారు. స్థానిక పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎన్టీఆర్ నటించిన మంచి-చెడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా శ్రీనివాసరాజును సత్కరించారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, దివి హేమంత్, టి.సాంబశివరావు, పి.మాలకొండమరాజు, ఈదర శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, ఎం.రాఘవరావు, డి.భాస్కర్, కె.శివప్రసాద్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి -మంగళగిరి

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి సాధించగలమని ఎంటిఎంసి అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు అన్నారు. గురువారం యూనిసెఫ్,సార్ట్స్ సంస్థల భాగస్వామ్యంతో రేస్ సంస్థల ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ హాల్‌లో వాష్ ప్రాజెక్ట్ పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్పొరేషన్ పరిధిలోని మెప్మా, పారిశుద్ధ్య, ఆరోగ్య, ఇంజనీరింగ్ విభాగంలోని సిబ్బందికి నగరంలో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత అనే అంశాల పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మనుగడకు ఆరోగ్యమైన వాతావరణం ఎంతో అవసరం అన్నారు. అలాంటి వాతావరణానికి అవసరమయ్యే సహజ వనరుల్లో ఒకటైన నీటిని మనమే కలుషితం చేసుకొని, ఆ కలుషిత నీటిని తాగి అనేక రోగాల బారిన పడుతున్నామన్నారు. సార్ట్స్ ప్రతినిధి కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా నీటిని వృధా కాకుండా పొదుపుగా వాడాలన్నారు.. రేస్ సంస్థ ప్రతినిధి నళినీ మాట్లాడుతూ యూనిసెఫ్ సంస్థ బాలలు , మహిళల అభివృద్ధి కోసం 92 దేశాలలో పనిచేస్తుందని అన్నారు. పౌష్టికాహారం, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత, ఆరోగ్యం రంగాలలో ప్రజలలో అవగాహన శిక్షణ, సామర్థ్యాలను పెంపొందించుటకు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి సెక్రటరీ పి శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటి కో-అర్డినేటర్ రాజశేఖర్, సార్ట్స్ సంస్థ ప్రతినిధులు బివి రావు, రేస్ సంస్థ ప్రతినిధులు రాజ్ కుమార్, వాష్ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ టి.విజయకుమారి పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ అధ్యాపకునికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు



వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పాడ్య భరత్‌సింగ్‌కు కర్ణాటకలోని మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎంఎహెచ్‌ఈ) పీహెచ్‌డీ పట్టా అందజేసిందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కార్యాలయం గురువారం తెలిపింది. " ప్రిపరేషన్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ మల్టిఫంక్షనల్ నానోపర్టికులేట్ టాపికల్ ఫార్ములేషన్స్ ఫర్ ద ట్రీట్‌మెంట్ ఆఫ్ స్కిన్ క్యాన్సర్" అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని, ఈయనకు ఎంఎహెచ్‌ఈలోని ఫార్మాస్యూటిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ ముతలిక్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొంది.

రేషనలైజేషన్‌కు గురయ్యే అందరికీ పాయింట్లు ఇవ్వాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురవుతున్న ఉపాధ్యాయులందరికీ రేషనలైజేషన్ పాయింట్లు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ కోరారు. బదిలీలలో అసంబద్ధాలను సరిచేయాని ప్రభుత్వాన్ని కోరుతూ యుటిఎఫ్ నాయకులు గురువారం డిఇఒకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగతుల విలీనం వల్ల బదిలీ అవుతున్న ఉపాధ్యాయులకు మాత్రమే కాక, జీఒ 117 ద్వారా రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులందరికీ పాయింట్లు ఇవ్వాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్ నిలుపుదల చేయాలని, దరఖాస్తు చేసుకునే గడువు రెండ్రోజులు పొడిగించాలని, అప్‌డేట్ సీనియార్టి లిస్టులు వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, షకీలాబేగం, వెంకటేశ్వరరావు, గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు రంగారావు, ప్రభుజీ, యోగేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న శిక్షకులతో కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

ఆర్‌విఆర్‌లో ముగిసిన స్కిల్ హబ్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డవలప్మెంట్ సెంటర్‌ల ద్వారా అందిస్తున్న శిక్షణా తరగతులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పొందడానికి ఎంతో దోహద పడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. నేషనల్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపి స్కిల్ డెవలప్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో, ఆటోమోటివ్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ విభాగం ద్వారా కళాశాలలో గత కొన్ని రోజుల నుండి జరుగుతున్న ఆటోమొబైల్ స్కిల్ హబ్ శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ శిక్షణా తరగతుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సిమెన్స్ ఆటోమోటివ్ ఫోర్ వీలర్ లాబ్స్ ట్రైనర్ల ద్వారా, విద్యార్థులకు ఉపాధి అవకాశాలకు అవసరమైన, నైపుణ్య శిక్షణను అందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా శిక్షకులు శిక్షణను అందుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఏ.పి.స్కిల్ డవలప్మెంట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

కంఠాస్ సంజీవనిలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు



కేక్ కట్ చేస్తున్న తులసీ ధర్మచరణ్ తదితరులు

రామచంద్ర పాలెంలో కంఠాస్ సంజీవని సైకియాట్రిక్ హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో వేద సీడ్స్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని అన్నారు. మతాలకు అతీతంగా ప్రజలు కరుణాభావంతో మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్షమాగుణంతో, సర్వప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తులసీ ధర్మచరణ్ సెమీక్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవ ప్రజలకు మేరీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హాస్పిటల్ సిబ్బందికి క్రిస్మస్ కానుకలు అందచేశారు. రోగులకు, స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ కంఠా జగదీష్, న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్, డాక్టర్ శాంత్, తోట రంగారావు, నీలం శివకృష్ణ, పుల్లగూర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని దరిచేరనివ్వొద్దు..: ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ మానసిక వత్తిడి పెరిగిపోతుందని, అందరికీ ప్రశాంతత తప్పనిసరిగా కావాలని తులసీ ధర్మచరణ్ అన్నారు. సరైన విశ్రాంతి లేకపోవటం వల్ల అనేక మానసిక సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. స్థానిక కొత్తపేటలో, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డులోని పచ్చా వారి వీధిలో డాక్టర్ కంఠా జగదీష్(సైకియాట్రిస్ట్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానసిక వైద్యశాల ఓపిని తులసీ ధర్మచరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, వేద సీడ్స్ డిజిఎం నీలం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

చేనేతకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలి

చేనేత జౌళి శాఖ ఏడీ కార్యాలయం ఎదుట ధర్నాలో నాయకులు



ధర్నా చేస్తున్న నేత కార్మికులు

ప్రజాశక్తి-గుంటూరు

చేనేత రంగానికి 2023 బడ్జెట్‌లో కేంద్రం రూ.5వేలు కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గుంటూరు చేనేత జౌళిశాఖ ఏడీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, డి.రామారావు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ పాలకులు అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కుకుందన్నారు. బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించటంతో మరింత సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. 2022లో నూలు పట్టు ధరలు వందశాతం పెంచారన్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించిన పవర్‌లూమ్ యజమానులకు బిజెపి ప్రభుత్వం రాయితీలు ఇచ్చి పవర్‌లూమ్‌లను ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్రం గత బడ్జెట్‌లో చేనేతకు రూ.200 కోట్లు కేటాయించి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులందరికీ రూ.24వేలు ఇస్తామని హామీ ఇచ్చి, సొంత ఇంటిలో మగ్గాలపై నేస్తున్న వారికే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా చేనేత పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని, ప్రతి కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలని, 11 రకాల రిజర్వేషన్‌లు అమలు చేయాలని, పట్టు నూలు ధరలు 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేతపై జిఎస్‌టి ఎత్తివేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీకి అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సీతారామాంజనేయులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్, మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ముఖద్వారాల డిజైన్ల రూపకల్పనకు పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోకి ప్రవేశించే ప్రధాన మార్గాల్లో ముఖ ద్వారాల ఏర్పాటుకు ఆకర్షణీయమైన డిజైన్ల రూపకల్పనకు పోటీలు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం డిజైన్ల ఆహ్వానం కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలిసి నగర కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోకి ప్రవేశించే ఐదు ప్రధాన మార్గాల్లో ముఖ ద్వా రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వాటిలో నగర ఖ్యాతిని, చరిత్ర ను ప్రతిబించేలా ముఖద్వారాలు రూపొందిస్తామన్నారు. కావున ముఖ ద్వారాల ఏర్పాటుపై ఆసక్తి ఉన్న ఆర్కిటెక్ట్, డిజైనర్ల నుండి డిజైన్లు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 18లోపు రిజిస్ట్రేషన్ చేసుకొని, 30లోపు తమ కాన్సెప్ట్ డిజైన్లు పంపాలన్నారు. జనవరి 3న ఫలితాలు ప్రకటిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో ప్రధమ బహుమతిగా రూ.1లక్ష, ద్వితీయ బహుమతి రూ.75 వేలు, తతీయ బహుమతి రూ.50 వేలు నగదు అందిస్తామని వివరించారు. అదనపు సమాచారం కోసం జిఎంసి డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య (99639 95372), కో-ఆర్డినేటర్ సూరజ్ (99599 06889)లను సంప్రదించాలని సూచించారు.

డిసిసిపి కోర్సుతో వందశాతం ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-గుంటూరు



శిక్షణకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

స్థానిక గుజ్జన గుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ కోర్స్ చేస్తున్న విద్యార్థినులు స్టైఫండ్‌తో కూడిన 6 నెలల శిక్షణకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు రెండున్నర సంవత్సరాల చదువు పూర్తి అయిన తర్వాత ఏదైనా పరిశ్రమలో ఆరు నెలల శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో, డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ కోర్సు చదువుతున్న విద్యార్థినులకు టెక్బియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, అపెక్స్ సొల్యూషన్ లిమిటెడ్ సంస్థలు వివిధ పరీక్షలు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేశారన్నారు. ఈ శిక్షణలో నెలకు రూ.8500లు స్టైఫండ్ ఇస్తారన్నారు. డిప్లొమా ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ కోర్సు చదివిన విద్యార్థులకు వందశాతం ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారందరూ పాలీసెట్-2023 ద్వారా ఈ కోర్సులో చేరటానికి అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9391218749, 9490639632, 8019396933, 9848187964 నంబర్లలో సంప్రదించాలన్నారు.



మొదటి బహుమతి అందుకుంటున్న ఒంగోలు కాలేజి జట్టు

చిప్స్‌లో ఏఎన్‌యు అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో గురువారం ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కాలేజిల నుండి మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. ఒంగోలు ప్రభుత్వ మహిళా కళాశాల జట్టు ప్రధమ స్థానంలో, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తెలియజేశారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ పోటీలకు యూనివర్సిటీ నుండి పరిశీలకులుగా పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ సౌత్‌జోన్ మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎంపికలను పి.గణేష్ పర్యవేక్షించారు.

క్విజ్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వినోద్ తదితరులు

క్విజ్ పోటీలలో భాష్యం విద్యార్థులు మంచి ప్రతిభ చూపించారని వివా ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ వశిష్ట తెలిపారు. గుంటూరులోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో 'వివా ఎడ్యుకేషన్ హెల్పింగ్ లెర్న్' వారు కృష్ణా, గుంటూరు అర్బన్, రూరల్‌లోని పలు బ్రాంచిల విద్యార్థులకు సృజనాత్మక శక్తిని పెంపొందించటానికి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ ఫైనల్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. ఈ పోటీల్లో ప్రధమ, ద్వితీయ విజేతలైన గుంటూరు గ్రూపు విద్యార్థులకు మెమోంటోలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా గుంటూరు జెడ్ఇఒలు, కృష్ణా, గుంటూరులోని పలు బ్రాంచిల ప్రిన్సిపాల్స్ విజేతలైన విద్యార్థులను అభినందించారు.

తాడికొండకు అదనపు సమన్వయకర్తగా కత్తెర సురేష్ కుమార్

ప్రజాశక్తి-తాడికొండ



తాడికొండ నియోజకవర్గం వైసిపి అదనపు సమన్వయకర్తగా కత్తెర సురేష్ కుమార్ నియమిస్తూ పార్టీ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో డొక్కా మాణిక్య వరప్రసాద్ నియమించగా పార్టీలో తీవ్ర విభేదాలు చెలరేగాయి. అనంతరం డొక్కా ను జిల్లా అధ్యక్షులుగా నియమించారు. ఈ నేపథ్యంలో కత్తెర సురేష్ కుమార్ కు బాధ్యతలను అప్పగించారు. ఆయన భార్య కత్తెర హెనీ క్రిస్టినా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేస్తున్న విషయం తెలిసిందే.